క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా 33/11కేవీ బాలాజీనగర్ సబ్ స్టేషన్ 11కేవీ మహంకాళి ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మున్సిపల్ కార్యాలయం, శివాజీనగర్, సీపీఐ కాలనీ, భజరంగ్‌నగర్, లెవిస్ ఎన్‌క్లేవ్, వీకే.ఎన్‌క్లేవ్, జ్యోతి కాలనీ, శ్రీరామ్‌నగర్, మార్వాడి లైన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు జగన్నాథ రథయాత్ర

మేడ్చల్: హరేకృష్ణ సేవా సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్‌లో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు సమాజ్ ప్రతినిధులు తెలిపారు. మేడ్చల్ పట్టణంలోని చంద్రనగర్ పోచమ్మ ఆలయం నుంచి బాలాజీ నగర్, ఎంఆర్‌ఆర్ కాలనీ, ఏడుగుళ్ల, జాతీయ రహదారి మీదుగా ఆర్టీసీ కాలనీ వరకు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక



నాయీ బ్రాహ్మణ సేవాసంఘం మండల కమిటీ సభ్యులు

ఘట్‌కేసర్: రంగనాయక స్వామి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఘట్‌కేసర్ మండల కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఎదులాబాద్ శ్రీగోదాదేవి మన్నారు రంగనాయక దేవాలయం ఆవరణలో మంగళవారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా రాజు, రమేశ్, కార్యదర్శి గణేశ్, కోశాధికారిగా రామాంజనేయులు, సలహాదారులుగా రాకేశ్, సురేశ్‌ను ఎన్నుకున్నారు.

ఇద్దరు ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి



నాగరాజుగౌడ్



రాంబాబు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ నాగరాజుగౌడ్, డిటెక్టివ్ ఎస్ఐ రాంబాబుకు ఉత్తమ సేవలు అందిస్తున్నందుకు సీఐలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం జవహర్‌నగర్ సీఐ సీతారాం, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, ఎస్ఐలు అనిల్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్‌రెడ్డి, కౌశిక్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోండి

కీసర: నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకం పొందిన కీసర మండలంలోని రైతులు రైతు బంధు కోసం వచ్చేనెల 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. ఈ నెల 19 తేదీ వరకు పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన రైతులు అర్హులని పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్‌లతో సంబంధిత రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారికి ఇచ్చి పేరు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం



మేడ్చల్: యాజమాన్య ఆదేశాలతో మేడ్చల్ ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డిపో అధికారులు, కార్మికులు రక్తదాన శిబిరంలో పాల్గొని దానం చేశారు. 100 మంది వరకు రక్తదానం చేశారని డీఎం సుధాకర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

శామీర్‌పేట్: ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని అలియాబాద్ గ్రామానికి చెందిన జగదీశ్వర్‌యాదవ్(23) యువరైతుగా జీవనం సాగిస్తూ తండ్రికి వ్యవసాయంలో తోడుగా ఉంటున్నాడు. గత సోమవారం రాత్రి పాల డెయిరీలో పాలు పోసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం ఇంట్లో కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో ఆచూకీ కోసం వెతికారు. అలియాబాద్-బాబాగూడ దారిలో రోడ్డు పక్కన ఉన్న ఓ వ్యవసాయం పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికుల సమాచారంతో ఘటన స్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు తమ కుమారుడు విగతజీవిగా పడిఉండటంతో బోరున విలపించారు. శామీర్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

బడిబాటకు అనూహ్య స్పందన

- 407 ప్రభుత్వ పాఠశాలల్లో 9,037 మంది విద్యార్థుల చేరిక
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి 4,691 మంది..
- వచ్చేనెల 6 వరకు బడిబాట కార్యక్రమం పొడిగింపు
- కరోనా నేర్పిన కష్టకాలంతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు ఉండటంతోనే..

సర్కారు బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతోంది. కరోనా కష్టకాలం నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు చెల్లించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారం కావడంతో ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి మించి ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపు వెళ్లేలా చేస్తోంది. అందులో భాగంగానే సర్కారు బడులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదరణ లభిస్తోంది. కోవిడ్-19 వైరస్ సృష్టించిన ఆర్థిక ఇబ్బందులు, నేర్పిన పాఠాలు పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రుల్లో పెను మార్పు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. పైగా ప్రైవేట్ స్కూళ్లు ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలల్లో ఏడాదికి ఏడాది పెంచుతున్న అధిక ఫీజులను కూడా చెల్లించలేక చాలా మంది తల్లిదండ్రులు మారిన పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

6వ తేదీ వరకు పొడగింపు

మేడ్చల్-మల్కాజిగిరిలో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల(విద్యార్థుల) పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన విద్యాశాఖ 12 నుంచి 19వతేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆర్భాటంగా, పెద్దఎత్తున చేపట్టింది. దీంతో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ నేపథ్యంలోనే బడిబాటను వచ్చే నెల 6వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ పొడిగించింది. జిల్లా విద్యాశాఖ నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 9,037 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ప్రైవేట్ స్కూళ్ల నుంచి 4,691 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం రికార్డుగా జిల్లా విద్యాశాఖ పేర్కొంటోంది.

ప్రభుత్వ బడులపై ఆదరణ పెరిగిందిలా..

మేడ్చల్ జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా అన్ని స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. అలాగే.. మనబడి-మన ఊరు-మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన వంటి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 35 పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతుండటంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను కల్పిస్తున్న అంశాలను బడిబాటలో జిల్లా విద్యాశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఫలితంగా బడిబాటకు అనూహ్య స్పందన లభిస్తోంది.

కరోనా నేర్పిన కష్టకాలం నుంచి..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కరోనా కష్టకాలంలో భాగంగా 2021-22 విద్యాసంవత్సరంలో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. అలాగే.. 2022-23లో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు.

మండలాల వారీగా ఇలా..

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 4,691 మంది విద్యార్థులు చేరగా, ఇందులో మండలాల వారీగా చేరిన విద్యార్థుల సంఖ్య ఈ విధంగా ఉంది. మేడ్చల్ మండలంలో 232 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరగా, దుండిగల్ మండలంలో 288, బాచుపల్లిలో 197, కుత్బుల్లాపూర్‌లో 448, కూకట్‌పల్లిలో 501,

- బాలానగర్‌లో 215, అల్వాల్‌లో 285, మల్కాజిగిరిలో 273, ఉప్పల్‌లో 694, మేడిపల్లిలో 140, కాప్రాలో 461, శామీర్‌పేటలో 141, కీసరలో 327, ఘట్‌కేసర్‌లో 439, మూడుచింతలపల్లిలో 50 విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చేరారు.

అక్రమ రిజిస్ట్రేషన్ దస్తావేజులను రద్దు చేయాలి

గౌడవెల్లి పంచాయతీ కార్యదర్శికి కలెక్టర్ ఆదేశం

మేడ్చల్: బోగస్ పేర్లతో.. బోగస్ కాగితాలు సృష్టించి గౌడవెల్లి పరిధిలో స్కూల్‌కు కేటాయించిన స్థలాన్ని అన్యాక్రాంతం చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన దస్తావేజులను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ గౌడవెల్లి పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలోని సర్వే నంబర్ 544/బీలో గల వెంచర్‌లో పాఠశాల ఏర్పాటుకు కోసం 1,720 గజాల స్థలం ఏర్పాటు చేయగా ఆ స్థలాన్ని గ్రామ సర్పంచ్ సురేందర్ భార్య విజయలక్ష్మి పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. కాగా గ్రామస్తుల ఫిర్యాదుతో విచారణ జరిపిన అధికారులు కలెక్టర్‌కు నివేదిక ఇందజేశారు. విజయలక్ష్మి పేరుపై ఉన్న దస్తావేజులను రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు గతంలోనే వచ్చినా అవి అమలు కావడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఆరోపించారు. గ్రామ సర్పంచ్ సురేందర్ సుమారు రూ.4 కోట్ల విలువ చేసే స్కూల్ స్థలాన్ని మింగేయాలని చూడగా తాము ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు త్వరగా స్పందించి కలెక్టర్ ఆదేశాల మేరకు దస్తావేజులను రద్దు చేయాలని కోరారు.

మాదిగలకు జనాభా ప్రాతిపదికన సీట్లు ఇవ్వాలి

- తెలంగాణలో 13 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలి
- టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మీసాల మల్లేష్

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాబోయే ఎన్నికల్లో మాదిగలకు జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు 13 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మీసాల మల్లేష్ కోరారు. ఎస్సీలకు కేటాయించిన 18 అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు అధిక సీట్లను అన్ని పార్టీలు కేటాయించాలన్నారు. మంగళవారం నగర శివారులోని జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలు అధికంగా ఉన్న వరంగల్, నాగర్ కర్నూల్, నల్గొండ, మునుగోడు వంటి జనరల్ స్థానాలను కూడా కేటాయించాలన్నారు. అర్హులైన వారందరికీ దళిత బంధును వర్తింపజేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలన్నారు. దళితులకు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం అందజేసే సాయాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 5 వేల మంది దళితులకు దళిత బంధు అమలు చేయాలన్నారు. డప్పు-చెప్పు వృత్తిదారులకు తక్షణమే రూ.2 వేల పెన్షన్ ప్రకటించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్(టీఎస్) రాష్ట్ర, జిల్లా నాయకులు నర్సింగ్‌రావు, గణేష్, మల్లేష్, రాంచందర్, నర్సింహ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ సంబరాలా..?

సర్కారు బడులను సందర్శించిన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



ఎదులాబాద్ పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని రెండు ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాఠశాలలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితవాడ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థలో ఉన్నాయని, గదులు లేక విద్యార్థులు ఆరు బయట కూర్చుంటున్నారని, తాగునీరు, మూత్రశాలల్లో నీటి సౌకర్యం లేదన్నారు. మధ్యాహ్న భోజనం వంటలు చేసే వారికి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని విమర్శించారు. విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్




చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ దీపికరెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ వెస్ట్ గాంధీనగర్‌కు చెందిన మల్లారెడ్డికి మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్‌తో కలిసి నాగారంలో ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) చెక్కు అందజేశారు. అనారోగ్యంతో మల్లారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందగా సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.లక్ష మంజూరయ్యాయి. ఆ చెక్కును మంగళవారం వారు అందజేశారు. కౌన్సిలర్లు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీధర్, శ్రీనివాస్‌గౌడ్, కష్టారెడ్డి, శ్రీను, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన చైర్ పర్సన్

మేడ్చల్: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి 4వ వార్డు కౌన్సిలర్ తుడుం గణేష్‌తో కలిసి లబ్ధిదారుడికి అందజేశారు. పట్టణంలోని కిష్టాపూర్‌కు చెందిన సీహెచ్.పోచమ్మకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.17,500 చెక్కును వారు అందజేశారు.

అర్హులు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే రాజేష్ నానమ్మ కమలమ్మకు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కు మంజూరు కాగా మంగళవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, చంటి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది మహిపాల్, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



క్యాబినెట్ ఎలక్షన్‌లో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన స్కూల్ క్యాబినెట్ ఎలక్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే లీడర్‌షిప్ క్వాలిటీస్‌ను అలవర్చుకోవాలన్నారు. ఓటు హక్కు గురించి, ఓటు విలువను గురించి విద్యార్థులకు వివరించారు. క్యాబినెట్ ఎలక్షన్‌లో స్కూల్ పీపుల్ లీడర్, డిప్యూటీ స్కూల్ పీపుల్ లీడర్, హౌస్ క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించిన స్వచ్ఛ్ భారత్‌ను ఆదర్శంగా తీసుకుని స్కూల్ పరిసర ప్రాంతాలను ఎంతో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దీని కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సిబ్బందికి జీతాలివ్వండి

అల్వాల్: కంటి వెలుగులో పని చేసిన సిబ్బంది(పీఎంఓఓ)లకు తక్షణమే జీతాలు చెల్లించాలని పీఎంఓఓ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిడతనపల్లి సురేష్ పేర్కొన్నారు. మంగళవారం అల్వాల్‌లో ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు నేత్ర వైద్య సహాయకులను కంటి వెలుగు ముగియగానే మధ్యలో గాలికి వదిలి వేయకుండా పూర్తిస్థాయిలో వారి సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొనసాగించాలని కోరారు. జూన్ నెల చివరి దశకు వచ్చేసరికి ఇప్పటికీ మే నెల జీతాలు ఇంకా ఇవ్వలేదన్నారు. మే, జూన్ నెల జీతాలు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిబ్బందితో వెట్టిచాకిరీ చేయించుకొని సమయానికి కనీసం చెల్లించే జీతాలు కూడా చెల్లించకుండా సిబ్బందిని తీవ్రమైన అవమానాలకు, ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. ప్రతినెలా ఇదే రీతిలో జీతాలు సమయానికి చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పూర్తిస్థాయిలో కంటి వెలుగును నమ్ముకొని వచ్చి పనిచేస్తున్న తమకు ఇంటి కిరాయి, పాల బిల్లు, కిరాణం సరుకులు, పిల్లల స్కూల్ ఫీజులు ఎలా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులను ఎన్నిసార్లు అడిగినా స్పందన లేదని రేపు, మాపు అంటూ మభ్య పెడుతున్నారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌ను పలుమార్లు కలిసి సమయానికి జీతాలు ఇవ్వాలని కోరామన్నారు.

కీసర సీఐగా వెంకటయ్య



కీసర: స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఎ.వెంకటయ్య కీసర పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు కీసర పీఎస్‌లో సీఐగా పనిచేసిన పి.రఘువీర్ రెడ్డి బదిలీపై వెళ్లారు.

బక్రీద్ ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకోవాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఈద్గాల్లో గురువారం జరిగే ప్రార్థనలు ప్రశాంతంగా జరుపుకోవాలని జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్, ఈద్గా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మహ్మద్ పాషామియా, టి.కాలేషాలు మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. వెంకటేశ్వర కాలనీ, వికలాంగుల కాలనీ, అంబేడ్కర్‌నగర్, మల్కారం, ఫరానగర్, వైఎస్‌ఆర్ డంపింగ్ యార్డు వద్ద, అరుంధతినగర్‌లలోని ఈద్గా వద్ద ప్రార్థనలు జరుపుతారని, వర్షాకాలం నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు.

జర్నలిస్టును దూషించినందుకు నిరసన

జవహర్‌నగర్: ఓ పత్రిక జర్నలిస్టును అసభ్య పదజాలంతో మనోభావాలు దెబ్బతీసే విధంగా కాప్రా తహసీల్దార్ దూషించినందుకు జవహర్‌నగర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు మంగళవారం జవహర్‌నగర్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మ అమరేందర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై కాప్రా తహసీల్దార్ అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని బహిర్గతం చేస్తే నోటీసులు జారీ చేయడం హేయమైన చర్యన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. రవీందర్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రధాని ప్రసంగాన్ని వీక్షించిన బీజేపీ శ్రేణులు

మేడ్చల్‌రూరల్: మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని బీజేపీ మండల శ్రేణులు వీక్షించారు. మండలంలోని మునీరాబాద్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్చువల్ లైవ్‌లో బీజేపీ బూత్ అధ్యక్షుడు, శక్తి కేంద్రాల ఇంచార్జులు, నాయకులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, కౌన్సిలర్లు సరస్వతి, హంసరాణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం





షెడ్లను తొలగిస్తున్న అధికారులు

మేడ్చల్: 44వ జాతీయ రహదారి వెంబడి చెక్‌పోస్ట్ నుంచి పారిశ్రామికవాడ వరకు ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. మున్సిపల్ అధికారులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, పోలీసుల బందోబస్తు మధ్య షెడ్లను, రోడ్లపై ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాలు, నిర్మాణాలను పూర్తిగా తొలగించారు. మున్సిపల్ అనుమతులు లేకపోవడంతో తొలగించామని అధికారులు తెలిపారు.

మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు



కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లో మురుగు సమస్య పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ డివిజన్‌లో మురుగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లో ఆమె జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో మురుగు పారుతోందని గుర్తించి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ ప్రశాంతి, జలమండలి మేనేజర్ రమేష్, చందు, శేఖర్, సతీష్, కవిత, నాగేశ్వర్‌రావు, అరవింద్, అశ్విన్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం మెరుగు పర్చండి

అల్వాల్ డివిజన్‌లో పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఇంటి నుంచి చెత్తను సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ మంజుల, పారిశుద్ధ్య అధికారితో పాటు రాంకీ సిబ్బంది నర్సింహ, జవాన్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన స్కూల్ క్యాబినెట్ ఎలక్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే లీడర్‌షిప్ క్వాలిటీస్‌ను అలవర్చుకోవాలన్నారు. ఓటు హక్కు గురించి, ఓటు విలువను గురించి విద్యార్థులకు వివరించారు. క్యాబినెట్ ఎలక్షన్‌లో స్కూల్ పీపుల్ లీడర్, డిప్యూటీ స్కూల్ పీపుల్ లీడర్, హౌస్ క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించిన స్వచ్ఛ్ భారత్‌ను ఆదర్శంగా తీసుకుని స్కూల్ పరిసర ప్రాంతాలను ఎంతో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దీని కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.